

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వర రావు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలో ఎవరైనా కోడిపందెం, పేకాట, నాటుసారా తయారీ, విక్రయాలు, కర్ణాటక మద్యం అక్రమాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా గ్రామాల్లో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తమకు తెల్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పండగకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు విలువైన వస్తువులను ఇంటిలో ఉంచొద్దని, పక్కింటి వారికి లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. లేదా 9440900712 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. సమావేశంలో ఎఎస్ఐ క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

భోగి మంటల్లో జిఒ ప్రతులు దహనం

34వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. వై ఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ జారీ చేసిన ఎస్మా జిఒ నంబర్ 2 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.



రైల్వేకోడూరు : ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

రైల్వేకోడూరు : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో, ఆదివారం భోగి పండుగ రోజూ అంగన్వాడీలు రోడ్డుపైనే, భోగి మంటలు వేసి, ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ఎస్మా నోటీసులతో బెదిరించి, ఉద్యమాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, పి.జాన్‌ప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం, ప్రాజెక్టు అధ్యక్షురాలు, ఎన్. రమాదేవి, కోశాధికారి. జి. పద్మావతి, ప్రసన్న,శిరీష, కుమారి, జై కుమారి, మునీంద్ర, సుజాత, సురేఖ, వాణి, రెడ్డమ్మ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 34వ రోజు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఎస్మా జిఒ ప్రతులను భోగి మంటల్లో వేసి కాల్చి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ సంక్రాంతి సంబరాలు జరుపుకుంటుంటే తాము మాత్రం వేతనాల పెంపునకు రోడ్డుపై ఉద్యమాలు చేసే దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి వెంటనే అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి ప్రాజెక్టు కార్యదర్శి ఓబులమ్మ సెక్టార్ లీడర్లు మరియు రామాపురం లక్కిరెడ్డిపల్లి గాలివీడు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు **మదనపల్లి :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ఎస్మా జిఒ కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేసి 34 వరోజు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు హరింద్రనాథ్ శర్మ, నాయకులు మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సమ్మెను నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి,అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లి : రోడ్డుపైనే దోశ వేస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

నిరసన గళంపై ఉక్కుపాదమా..? : యుటిఎఫ్



ప్రభుత్వ వ్యతిరేక జీవో ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజాస్వామ్య దేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజలు తమకు రావాల్సిన హక్కులపై నిరసన గళాన్ని వినిపించటం సాధారణమని, కానీ ఎలాంటి సమావేశాలకు, సదస్సులకు, పోరాటాలకు కూడా అనుమతి ఇవ్వకుండా నిర్బంధం ప్రయోగించడం తగదని, వారిపై ఉక్కుపాదం మోపడం న్యాయం కాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.హరి ప్రసాద్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమాలపై ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ భోగిమంటల్లో అప్రజాస్వామిక విధానాల పత్రాలను దహనం చేసిన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా సంఘాలకు సంబంధించి ఏ చిన్న సదస్సు పెట్టుకోవాల్సి వచ్చినా, ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా నిరాకరించటం, యాక్ట్ 30 అమలులో ఉందని నిరాకరించే పని చేయటం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వం నుంచి రావాల్సిన సాధారణమైన హక్కులను అమలు చేసేదానిలో ఉన్న ఇబ్బందుల్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం కోసం, రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగానే, నిరసన పోరాటాలకు పిలుపునిస్తారని చెప్పారు. తమ సొమ్ము తమకు ఇవ్వటానికి ఎందుకింత నిర్బంధమో ఈ ప్రభుత్వం చెప్పాలని కోరారు. కొన్ని రాజకీయ పార్టీలకు, సంస్థలకు, ఉద్యోగ సంఘాలకు స్వేచ్ఛగా అనుమతిస్తున్న ప్రభుత్వం, ప్రత్యేకించి యుటిఎఫ్ పోరాటాలకు, సదస్సులకు అనుమతి ఇవ్వడం కోసం యాక్ట్ 30 సాకుగా చూపటం పట్ల తీవ్ర ఆక్షేపణ తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని సృష్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, నాయకులు వినోద్ కుమార్, నరసింహారావు, పాపయ్య, వీరయ్య, రవి, ప్రతాప్, ప్రసాద్ రామక్రిష్ణ, చౌదరి, సి.వెంకట సుబ్బయ్య, శ్రీనివాస రాజు, మల్లికార్జున, యు.వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు. **పీలేరు :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించని ప్రభుత్వానికి నిరసనగా యుటిఎఫ్ నాయకులు డిమాండ్ ప్రతులను ఆదివారం పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) భోగి మంటలు వేసి దహనం చేశారు. ఉపాధ్యాయులకు రావలసిన రూ.18 వేల కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము ఏ కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వం దాన్ని నిరంకుశంగా వ్యవహరిస్తూ అణచివేయడాన్ని వారు నిరసించారు. ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న డబ్బులకు కూడా దిక్కు లేకపోవడం దారుణం అన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సదాశివ రెడ్డి, అన్నమయ్య జిల్లా కోశాధికారి బి. చంద్రశేఖర్, ఆడిట్ కమిటీ సభ్యులు విశ్వనాథ రెడ్డి, చిత్తూరు జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు జి. రాధాకృష్ణ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకుడు మోడం చంగల్ రాయుడు, రేగంటి సుధాకర్, వెంకటరమణ, రమేష్ రెడ్డి, ఉదయ్ కిరణ్, దేవేందర్ రెడ్డి, సుబ్రమణ్యం, జయరాం పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బత్యాల చంగల్‌రాయుడు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం చీకటిలోకి మెట్టబడిందని, ఆయన హయాంలో గత నాలుగేళ్లుగా రాష్ట్రం అభివృద్ధి లోనూ, ఆర్థికంగానూ పూర్తిగా వెనుకబడిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు.బత్యాల భవన్‌లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు జిఒ నెంబర్ -1 తీసుకోచ్చారని, తద్వారా ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి నిధులు, సహజ సంపదలను కొల్లగొట్టి లక్షల కోట్లు దం డుకు న్నారని ఆరోపించారు. కేవలం ఇసుక మీదే జగన్ రూ.40 వేల కోట్లు దండుకు న్నారని ఆరోపించారు. భోగి మంటల్లో జిఒ ప్రతులు దగ్ధం చేశారు. పాడిపం టలు, ధాన్యం రాశులు, చక్కని సంస్కృతి, సంప్రదాయాల నడుమ సంక్రాంతి ఆనందాలలో తేలాల్సిన రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం జగన్ జైలుకెళ్లడం ఖాయం :ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నాలుగున్నర ఏళ్లుగా ప్రభుత్వం అవలంబిస్తున్న జిఒ కాపీలను భోగి మంటలో దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌పై తీవ్ర నేరారోపణలో 38 కేసులు నమోదయాయని, 43 వేల కోట్ల దోపిడీపై సిబిఐ ఇడి ఛార్జిషీట్ కూడా వేశాయని తెలిపారు. ఈ కేసుల నుంచి జగన్ తప్పించుకునే అవకాశం లేదని జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన కేసుల్లో ఇప్పటికీ 12 సంవత్సరాల కాలంగా 3500 సార్లు వాయిదాలతో తప్పించుకున్నారని అన్నారు. జగన్ ఒత్తిడితోనే చంద్రబాబుపై సిఐడి అధికారులు కేసు నమోదు చేశారని అన్నారు. చంద్రబాబు వ్యక్తిగతంగా ఆర్థిక ప్రయోజనం పొందినట్లు సిఐడి ఎలాంటి ఆధారాలు కోర్టుకు చూపించలేదని తెలిపారు. ఇలాంటి సంఘటనలు ప్రజలు గమనిస్తున్నారని రాబోయే కాలంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, పట్టణ అధ్యక్షులు ఖాదర్‌వలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను ఏకం చేసేందుకే 'భారత్ జూడో న్యాయ యాత్ర'

ప్రజాశక్తి - రాయచోటి



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశంలోని బడుగు బలహీన వర్గాలను ఏకం చేయడమే కాంగ్రెస్ భారత్ జూడో న్యాయ్ యాత్ర యొక్క ప్రధాన ప్రేరణ అని డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ అన్నారు. ప్రతి పౌరుడూ న్యాయం పొందే ందుకు, న్యాయం కోసం ఉద్యమాన్ని చేపట్టేందుకు జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో న్యాయ యాత్రకు సంఘీభావంగా డిసిసి ఆధ్వర్యంలో పాదయాత్రను స్థానిక బస్టాండ్ రోడ్డులో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించి పార్టీ కార్యాలయం వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా అల్లాబకష్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ మాతృ సంస్థ అయిన బిజెపికి కులమతాలను రెచ్చగొట్టి కేంద్రంలో అధికారం ఎలా చేపట్టాలనే ఆలోచనే పత్న ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. మొన్న కన్యకు మారి నుంచి కాశ్మీర్ వరకు జరిగిన భారత్ జూడో యాత్రకు అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మణిపూర్‌లో ప్రారంభమైన భారత్ జూడో న్యాయ్ యాత్రకు యువతి యువకులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేసి ఈ దేశానికి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ కత్వాల్ మహమ్మద్ రఫీ, జిల్లా డిసిసి మైనారిటీ ఛైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, జిల్లా సోషల్ మీడియా చైర్మన్ నరేష్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నక్రిష్ణ, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు మంజునాథ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఖాదర్ వలీ, డిసిసి ఆర్గనైజేషన్ సెక్రెటరీ అమీర్ బాషా, జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు దర్బార్ బాష, ఆఫ్రిన్, జిల్లా డిసిసి సెక్రెటరీ చాన్ బాషా, బషీర్ అహ్మద్, ఖాధర్ ఖాన్, మహ్మద్ రఫ, తాలుకా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమణమ్మ, విజయ, షబీనా పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము

ప్రజాశక్తి - రాయచోటి



ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాలో ప్రయాణాలకు అందరికీ అందుబాటులో ఉంటూ ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం కల్పించడమే తమ లక్ష్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి పి. రాము పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆర్‌టిసి డిపో, బస్టాండ్‌లో ఆదాయం ఎలా పొందాలో, ప్రయాణాల సురక్షిత ప్రయాణం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో డిపోలు, బస్సుల వివరాలు తెలపండి?

జిల్లాలో ఐదు డిపోలున్నాయి. మదనపల్లి-1, మదనపల్లి-2, పీలేరు, రాజంపేట, రాయచోటిలలో ఉన్నాయి. మొత్తం 491 బస్సులు, 457 షెడ్డులు ఉన్నాయి. అందులో ఆర్‌టిసి షెడ్యూల్‌లు 322, హైర్ షెడ్డులు 135 ఉన్నాయి.

జిల్లాకు కొత్త బస్సులు వచ్చాయా?

జిల్లాకు కొత్తగా 32 అద్దె బస్సులు వచ్చాయి. అందులో మదనపల్లి-1కు మూడు, రాజంపేటకు 17, రాయచోటికి 14 అద్దె బస్సులు వచ్చాయి.

జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎన్ని సర్వీసులు నడుస్తున్నాయి?

జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు మొత్తం 30 సర్వీసులు నడుస్తున్నాయి. అందులో కర్ణాటకకు 17 , తమిళనాడుకు 5, తెలంగాణకు 8 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.

సంక్రాంతి పండగ సందర్భంగా స్పెషల్ బస్సులు ఏమైనా ఏర్పాటు చేశారు?

సంక్రాంతి పండగ సందర్భంగా వివిధ డిపోల నుంచి సుమారు ప్రత్యేకంగా 68 సర్వీసులు (ఒపిఅర్ఎస్-43, నాన్ ఒపిఆర్ఎస్ 25) నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జిల్లా కేంద్రంలో అధునాతన సదుపాయాలు ఉన్న కొత్తగా బస్సు స్టేషన్‌ను పొడగిస్తున్నాం. 24/7 ప్రయాణికుల సౌకర్యం కోసం విచారణ చేపట్టాం. ప్రయాణికులకు బస్సు స్టేషన్‌లో కొత్తగా ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం. టిక్కెట్ రిజర్వేషన్ కోసం ఒపిఆర్ఎస్ సదుపాయం, సరుకు రవాణా కోసం కార్గో కార్యాలయం, బస్సు పాసుల కౌంటర్, ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలను ఏర్పాటు చేశారు.

డ్రైవర్లకు శిక్షణ తరగతులు ఏమైనా నిర్వహిస్తున్నారు?

ప్రతి మంగళ, ప్రతి శుక్ర వారాల్లో డిపో నుంచి ముగ్గురు డ్రైవర్ల చొప్పున మొత్తం 15 మందికి ప్రమాదాలను నివారించడానికి, కెఎంపిఎల్ పెంచడానికి రాయచోటిలో డిపిటిఒచే శిక్షణ ఇస్తున్నాం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలోనూ క్రమం తప్పకుండా డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆదాయం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లా ఃలో ఖాళీగా ఉన్న ఆర్‌టిసి స్థలాలను లీజుకి ఇవ్వడం, బస్ స్టేషన్‌లల్లో ఖాళీగా ఉన్న స్టాళ్లకు టెండర్లు పిలిచాం. తక్కువ వచ్చే సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నాం. పోలీస్, ట్రాన్స్‌ఫోర్టు డిపార్ట్‌మెంట్ వారితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టి ఆర్‌టిసిని బలోపేతం చేయడం ద్వారా ఆదాయం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రయాణికులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ఆర్‌టిసిలో ప్రయాణం సురక్షితం , సుఖమయం, శుభప్రదం కావునా ప్రయాణికులు అందరూ ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించి, ఆదరించి సంస్థను బలోపేతం చేయాలి. ఆటోలలోనూ ఐదుగురికి మించి ప్రయాణం చేయరాదు. ప్రయాణికులకు ఆర్‌టిసి ప్రయాణమే సురక్షితం.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - రాయచోటి

సంక్రాంతి సంబరాలలో భాగంగా గుడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మదనపల్లి రోడ్‌లోని విఆర్ పాఠశాల వెనుక వైపున ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా గుడి మారుతి పౌండేషన్ చైర్మన్ కుమారుడు గుడి మౌద్విక్, దేవేంద్ర రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉత్సాహంతో క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని ప్రతిభ కనపరచడం అభినంద నీ యమని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి క్రీడాకారుడూ స్ఫూర్తితో ఆడాలని చెప్పారు. టోర్నమెంట్ 43 టీమ్‌లతో నాలుగు రోజులు పాటు నిర్వహి స్తామన్నారు. మొదటి విజేతకు రూ.50,01 6 ,రెండవ విజేతకు రూ.25,016 నగదును అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గజ,జ్ఞా నేంద్ర రెడ్డి,మద్దిపట్ల శేఖర్,వెంకట్రా ప్రసాద్, దేరంగుల ఆనిల్ ,ఆమరేశ్వర రెడ్డి, ఆనిల్, శ్రీనువాసులు, రెడ్డయ్య సుజికి, నవీన్, మోహన్ పాల్గొన్నారు. **ముగ్గుల పోటీలు..** తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని సమాజ సేవకులు గుది మారుతి పౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని మాధవరం కస్పాలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు గుది మారుతి పౌండేషన్ చైర్మన్ గుది మారుతి సతిమణీ గుది మౌనీషా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. మాధవరం గ్రామంలో గుదె మారు తి పౌండేషన్ తరపున రాయచోటి నియోజ కవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేయడమేగాక ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో హు స్సేన్, కసినేని మహేంద్ర, సతీష్, నరేష్, సునీల్ రాయల్, సురేంద్ర పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గుది మౌనీషా

యువతే దేశానికి వెన్నెముక : 'గంటా'

ప్రజాశక్తి ఒంటిమిట్ట

దేశానికి యువత వెన్నెముక లాంటి వారని టిడిపి నాయకులు గంటా నరహరి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే ఏదైనా సాధిస్తారన్నారు స్థిర సంకల్పం పట్టుదలతో ప్రయత్నం చేయాలని తెలిపారు. అనంతరం రాచపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మొదటి బహుమతి రూ. 40 వేలు, రెండో బహుమతి రూ. 30 వేలు, మూడవ బహుమతి రూ. 10 వేలు అందజేశారు. యువతకు ఎప్పుడు ఎలాంటి అవ సరమైన తాను ముందుంటానని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరిం చాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

ఈద్గాకు గంటా రూ. పది లక్షలు విరాళం

రాజంపేట అర్బన్ : ఇటీవల పట్టణ పరిధిలోని మన్నూరు ఈద్గాకు పది లక్షలు సాయం అందించిన టిడిపి నేత గంటా నరహరి ఆదివారం మరో పది లక్షలు విరాళం అందిస్తామని ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నిలిచిపోయిన పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచిస్తూ ఈద్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ముస్లిం సోదరులకు ఆదివారం విద్యా నగర్‌లోని తన కార్యాలయంలో మరో పది లక్షలు విరాళం అందజేస్తామని ముస్లిం పెద్దలకు మాట ఇచ్చారు. ముస్లిం సోదరులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీనిచ్చారు.

18న బాపట్లలో విసికె పార్టీ సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విసికె పార్టీ అభ్యర్థులు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తున్న నేపథ్యంలో బూత్ లెవల్ కమిటీల ఏర్పాటు, వారి పని విధానంపై నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 18వ తేదిన బాపట్లలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తోల్ తిరుమావళవన్ ఆదేశాల మేరకు చెన్నైలోని విసికె పార్టీ కేంద్ర కార్యాలయంలో రెండురోజుల పాటు హై లెవల్ కమిటీ మీటింగ్ జరిగిందని తెలిపారు. చెంగల్‌పట్టు ఎమ్మెల్యేబాబు, సెంట్రల్ ఆఫీస్ సెక్రటరీ బాలసింగం, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జె.విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి యు.గణపతి పాల్గొంటారని తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సుఖ సంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సంక్రాంతి పండుగ సంబరాలతో కార్మికుల కుటుంబాలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో 300మందికి పైగా మున్సిపల్ పారిశుధ్య, వాటర్ వర్క్స్ కార్మికులకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషతో కలసి దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తమను కుటుంబ సభ్యులవలే గుర్తు పెట్టుకొని, గౌరవించి బట్టలు పంపిణీ చేయడం అభినందనీయమంటూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, సాదిక్ అలీ, రౌనక్, కొలిమి చాన్ బాష, జాకీర్, ఫయాజ్ అహమ్మద్, అన్నా సలీం, జానం రవీంద్ర యాదవ్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడుగువ్వల బుజ్జిబాబు , పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, పట్టణ జె సి ఎస్ కన్వీనర్ నవరంగ్ నిస్సార్, మాజీ కో - ఆప్షన్ జాఫర్ అలీ ఖాన్, కో - ఆప్షన్ అయ్యవారు రెడ్డి,హజరత్ ఖాదర్ వలీ, సంజీవయ్య, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు కొత్తపల్లి ఇంతియాజ్ , మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యమివ్వాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

చట్టవ్యతిరేక క్రీడల జోలికి వెళ్లకుండా సంప్రదాయ ఆటలకే ప్రాధాన్యమివ్వాలని ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని సూచించారు. క్రీడలతో ఎంతో మానసిక ఉల్లాసం లభిస్తోందన్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గాంధీపేట రఘు, క్రీడాకారులు గణేష్, వెంకటేష్, శ్రీనివాసులు, రవికుమార్, మోహన్ కుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బడుగులకు భవిష్యత్తు

ప్రజాశక్తి-మదనపల్లి

రాజ్యాధికారంతోనే బడుగు, బలహీన వర్గాలకు భవిష్యత్తు ఉంటుందని బిసి హక్కుల పోరాటసమితిరాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు అధికంగా ఉన్న మదనపల్లి నియోజకవర్గంలో ఏ రాజకీయ పార్టీ కూడా గుర్తించి స్థానం కల్పించలేదన్నారు.ఆర్థికంగా బలంగా వున్న వారికి, అండ దండలు వున్న వారికి మాత్రమే అన్ని పార్టీలు పట్టం కడుతున్నాయని అన్నారు. సంఘసంస్కర్తలు, యువత, మేధావులు, విద్యావంతులను పక్కదో పటిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో బిసి హక్కుల పోరాట సమితి నేరుగా ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేసేందుకు సిద్ధమవుతుందని ప్రకటించారు. ఉచిత పథకాలను ఎరగా చూపి మరెంతో కాలం బడుగు బలహీన వర్గాలను మోసం చేయలేరని హితవు పలికారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లోను పోటీ చేయడానికి తమ అభ్యర్థులు ముందుంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులునాగినేని గోవిందు, ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బోమ్మనపల్లి లక్ష్మన్న, నాయకులు వైవి.శేఖర్‌నాయుడు, కొత్తూరు చినరెడ్డెప్ప, అమానుల్లా, రామకృష్ణ, నారాయణ స్వామి, చంద్రయ్య, నాగేంద్ర, మల్లికార్జున, ఖాదర్ వల్లి, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోడెం రాజశేఖర్



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న గడికోట మోహన్‌రెడ్డి

ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

ప్రజాశక్తి-రామాపురం

సంక్రాంతి పండుగ సంబరాలతో ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డిలు ఆకాంక్షించారు. భోగి పండుగ సందర్భంగా ఆదివారం రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం యర్రమరెడ్డి గారిపల్లెలోని వారి నివాసంలో వెయ్యి మందికి పైగా పేదలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు దుస్తులు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు, యువకులు, నాయకులు కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, మోహన్ రెడ్డి లు మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగ ప్రజల జీవితాలలో సానుకూల మార్పులకు సంకేతం కావాలని, ప్రజలు సిరిసంపదలుతో తులతూగాలని, సంపూర్ణ ఆయుర ఆరోగ్యాలుతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి లు జనార్దన రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపి బాబు, సర్పంచ్‌లు అయోధ్యపురం నాగభూషన్ రెడ్డి,వెంకటరెడ్డి,ఆయూబ్ ఖాన్, వెంకట్రా మిరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, యువజన విభాగం సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపిపి మురళీధర్ , మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, సత్యాయాదవ్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మైనారిటీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 15 పాయింట్ల జిల్లా అభివృద్ధి స్థాయి కమిటీలో ముస్లిం కమ్యూనిటీ తరుపున బి.కొత్తకోట నగర పంచాయతీకి చెందిన వైసిపి నాయకుడు మాజీ ఉప సర్పంచ్, మాజీ ఉపాధ్యక్షులు పి.మహమ్మద్ మాలిక్, ఎన్‌జిఒ మెంబెరుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం అయన మాట్లాడుతూ జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కమిటీ సమావేశంలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ సంక్షేమం, అభివృద్ధి సమస్యలపై చర్చిస్తామని అన్నారు. కమిటీలో తనకు అవకాశం కల్పించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎంపీమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు బిడ్డను వరించిన ఎస్ఐ ఉద్యోగం

ప్రజాశక్తి-బి.కొత్తకోట



వెంకటేష్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

సామాన్య రైతు బిడ్డను ఎస్ఐ ఉద్యోగం వరించింది. వివ రాలలోకి వెళితే మండలంలోని బడికాయలపల్లి పంచాయతీ, చతురానపల్లిలో నివాసముంటున్న వన్నూరప్పగారి శంకరప్ప కుమారుడు వెంకటేష్ ఇటీవల జరిగిన ఎస్ఐ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వెంకటేష్ జడ్‌పి హైస్కూల్లో పదవ తరగతి, సుంకు జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చదువు తున్నాడు. వెంకటేష్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు,108 వాహనం ఫైలట్ రాజు, మండల ప్రజలు వర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితిలో నిలవాలని వారి ఆకాంక్షించారు.



పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న మెగా అభిమానులు

ఘనంగా వైష్ణవ్‌తేజ్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-కడప సిటీ

మెగా హీరో వైష్ణవ్‌తేజ్ పుట్టిన రోజు వేడుకలు కడప మెగా కుటుంబ అభిమాని అబ్బన్నగారి రాజగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పండ్రా రంజిత్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కడప జడ్‌పి కార్యాలయం పక్కన పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలోని నిరుపేద అభాగ్యులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లును రంజిత్, రాజగోపాల్ చేతుల మీదుగా పంచి పెట్టారు. అనంతరం రంజిత్ మాట్లాడుతూ వైష్ణవ్ తేజ్ మేనమామలు చిరంజీవి, పవన్‌కల్యాణ్‌ల అడుగు జాడల్లో నడుస్తూ మరిన్నీ మంచి చిత్రాలలో ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డి, మెగా అభిమానులు బాలు నాయక్, సుధీర్ నాయక్, వినోద్, రాజశేఖర్, అభిమానులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కొల్లం యశ్వాల్‌రెడ్డి

కెబిఆర్‌ఎస్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వత్తలూరు గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకొని కీ.శే. కొల్లం బ్రహ్మానందరెడ్డి జ్ఞాపకార్థంతో అతని తమ్ముడు కొల్లంగంగిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారి ప్రతిభను వెలికి తీసేందుకే బ్రహ్మానంద రెడ్డి జ్ఞాప కార్థంతో ప్రతి ఏటా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు సంక్రాంతి పర్వదినాన్ని సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షిం చారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు రూ.50వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.30వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు రామసుబ్బారెడ్డి, యశ్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండలంలోని పత్తేగడ గ్రామపంచాయతీ కొటాలలో మాజీ సర్పంచ్ వాసునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో నూతన బోర్ వేసి మోటార్ బిగించి ప్రజల దాహార్తి తీర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యను రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు వాసునూరి చంద్రశేఖర్ కిశోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి పరిష్కరించారని అన్నారు. కొటాలపైన ఉన్న ప్రేమను చాటుకున్నారని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రతి ఏడాది జనవరి నెలలో వచ్చే సంక్రాంతి పండుగ భోగి మంటలతో ఆదివారం తెల్లవారుజాము నుంచే ఘనంగా ప్రారం భమైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఇంటి ముందు రంగురంగుల రంగవల్లికలతో అలంకరించి భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. ఇతర రాష్ట్రాల లోని తెలుగు వారందరూ సంక్రాంతి పండుగకు వారి వారి స్వగ్రామాలకు వెళ్లి సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు కనుల పండుగ ప్రారంభించారు. **తంబళ్లపల్లి:** మండలంలో ఊరువాడ ఆదివారం భోగి పండుగ సంబరాలను ప్రజలు ఆనందంతో జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముంగిట తెల్లవారి జామునే భోగి మంటలు వేశారు .ఇంటి ముంగిట రకరకాల ఆకర్షణీయంగా సంక్రాంతి ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడి పూలు గరికపాసలతో అలంకరించి గొబ్బెమ్మ పాటలు పాడి సంతోషాన్ని పంచుకున్నారు.రకరకాల పిండి వంటలు ఆరగించారు .కొన్ని పల్లెలలో ఎద్దులను పలకరించి కాటమరాజు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి కాటమరాజుకు పూజలు చేసి చిట్లకుప్ప తగలబెట్టి పశువులను బెదిరించి యువత కేరింతల కొడుతూ ఆనందాన్ని పంచుకున్నారు. **మదనపల్లి :** మండల పరిధిలోని కోళ్ళ బైలు పంచాయతీ, అమ్మ చెరువుమిట్టలోని వెలుగు వృద్ధాశ్రమం నందు సంక్రాంతి పండుగ వేడు కలు వైభవంగా నిర్వహించినట్లు వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి తెలిపారు. ముఖ్య



మదనపల్లి : వెలుగులో సంక్రాంతి సంబరాల్లో వృద్ధులు, చిన్నారులు



రైల్వేకోడూరు: భోగి మంటలు వేస్తున్న కాలనీ వాసులు

అతిథులు మండల లీగల్ కమిటీ సభ్యురాలు సుభద్ర, ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి, సుభద్ర, స్వరూపలు పాల్గొన్నారు. వృద్ధులు, సిబ్బంది, వెలుగు ఆవరణమంతా రంగు రంగుల రంగ వల్లు లతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. కృష్ణప్ప హరిదాసు వేషధారణ అంద రిని అలరించింది. వెలుగు కన్వీనర్ ఆర్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ పం డుగ భారత దేశం లోనే హిందూ పండగల్లో అత్యంత ప్రాముఖ్యమైన పండు గని తెలిపారు. సంక్రాంతి పండుగ ఆవశ్యకతను తెలియజేయడానికి చెక్కెరపొంగళి, అనపకాయలు, వేరుశనక్కాయల ఉడికించి ప్రసాదంగా పంచిపెట్టారు. కార్యక్రమంలో పి. లీనాకుమారి, గీత, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **'మిట్స్'లో..** మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి ఆద్వర్యంలో కళాశాలలో భోగి పండుగను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ అకాడమీ ప్రెసిడెంట్ ద్వారకానాథ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలోని ప్రతి గ్రామంలో మకర సంక్రాతి పండుగను స్వాగతం పలికారు. తెల్లవారు జామున సంప్రదాయాల అతీతంగా ప్రతి ఇంటి ముందర వ్యర్థమైన వస్తువులకు భోగి మంటలు అందించారు. చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు భోగి మంటలు వేసి ఆనందించారు. ఇంటి ముందర రంగుల రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు నిలబెట్టి పూర్వ సంప్రదాయాలు గుర్తు చేసుకున్నారు.

అస్తవ్యస్త పనులతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌తో అవస్థలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు అస్త వ్యస్తంగా జరుగుతుండడంతో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. రోడ్డు పనులు జరుగుతుండడంతో అడ్డది డ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అదే విధంగా రోడ్డు పనులకు సంబంధించి డ్రయినేజీ పనుల కోసం తీసిన మట్టిని రోడ్డుపైనే వేశారు. వాహనాలు పోయే సమయంలో దుమ్ము, ధూళి విపరీతంగా లేస్తోందని స్థానికులు, వాహనదారులు అల్లాడిపోతున్నారు.కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుండి పులివెం దుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు మోటర్ బైకు వాహన దారులు ఆ రహదారిలో వెళ్లాలంటే హడలిపోతున్నారు. దుమ్ము, ధూళి వల్ల రోగాల బారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని వాపోతున్నారు. కడప-పులివెందుల-గండి రోడ్డులో జనం ఇబ్బందులు అధి కారులకు కనిపించేలా లేదని పలువురు మండిపడుతున్నారు. కడప రోడ్డులోనే ఎక్కువగా వస్త్ర, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, రెడీమేడ్ దుస్తుల షాపులతోపాటు నిత్యావసర వస్తువుల దుకాణాలు ఉండడంతో పండగల సందర్భాల్లో ప్రత్యేకించి రద్దీ ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ తిప్పలు

నాణ్యతకు తిలోదకాలు

ఏడాదిలోపే దెబ్బతింటున్న లింక్ రోడ్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గ్రామాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లింక్ తార రోడ్లు దెబ్బతింటున్నాయి. గతేడాది పాడా నిధులతో ముసిరెడ్డిపల్లి నుంచి సుంకేసులకు 3.6 కిలోమీటర్ల మేర తార రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇందుకు దాదాపు రూ.2కోట్లు ఖర్చు చేశారు. ఈ తార రోడ్డు సరిగ్గా మూడో నెంబర్ కిలోమీటర్ సమీపంలోనే దెబ్బతింది. ఏడాదిలోపే రోడ్డు దెబ్బ తినడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణం సరైన రీతిలో చేయకపోవడంతోనే దెబ్బతిని ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎఇ దినేష్ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. రోడ్డు దెబ్బతిన్న విషయం వాస్తవమే అన్నారు. రైతులు అధిక లోడ్‌తో టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడంతో దెబ్బ తిందన్నారు. దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎఇ తెలిపారు.



దెబ్బ తిన్న తారు రోడ్డు

పండుగ వేళ.. రంగులకు భలే గిరాకీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పండుగలు వస్తున్నాయంటే రంగులకు భలే గిరాకీ ఉంటుంది. అందులోనూ కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగ అంటే రంగుల పొడికి మరీ డిమాండ్. నేటి కాలంలో రంగులు లేని రంగవల్లులు అంటూ ఎక్కడ కనిపించదు. ప్రతి ఇల్లు రంగవల్లుల శోభ సంతరించుకుంటుంది. అందుకే రంగుల పొడికి మంచి గిరాకీ ఉంటుంది. పల్లెటూరి నుంచి పట్నం దాకా రంగుల పొడిని వినియోగించడం అలవాటై పోయింది. ఈ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరిం చుకొని ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముగ్గుల పోటీలను నిర్వహిస్తారు. దీంతో రంగుల పొడికి మరింత గిరాకీ ఏర్పడుతుంది. దీనివల్ల చిరు వ్యాపారులకు కాస్త ఉపాధి ఉంటుంది. నేడు పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో రంగుల పొడి విక్రయాలు జరుగుతాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏ ఊరు చూసినా ఆ ఇంటి ముంగిట రంగవల్లులు ఉట్టిపడు తున్నాయి. ఏది ఏమైనా సంక్రాంతి, కొత్త సంవత్సరం వంటి రోజుల్లో రంగుల పొడికి గిరాకీ ఉంటుందని చెప్పడంలో సందేహం లేదు.

కనిపించని హరిదాసులు..

సంక్రాంతి పర్వదినం సందర్భంగా పల్లెటూర్లలో కనిపించే హరిదాసులు కనుమరుగయ్యారు. సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చే వాటిలో హరిదాసులు ఒకరు. సంక్రాంతి పండుగ నెల పొడవునా గ్రామీణ ప్రాంతాల్లో వీరు దర్శనమిస్తారు. అందమైన రంగవల్లులు, గొబ్బె మ్మలతోపాటు కనిపించే హరిదాసులు కాలగమనంలో దూరమయ్యారు. మానవ నాగరికత ఆవిర్భవించినప్పటి నుండి హరిదాసులు సంక్రాంతి పండుగ వేళ దర్శనం ఇవ్వడం అరుదు. తెలుగు గొప్పదనాన్ని సంకీర్తనలతో తెలియజేయడం హరిదాసుల ప్రాముఖ్యతను అంతరిం చుకుంటుంది. సంవత్సరంలో ఎప్పుడూ కనిపించని హరిదాసులు ధనుర్మా సంలోనే దర్శనమిస్తారు. నెల రోజులపాటు భక్తి పాటలతో ఇంటింటిని పావనం చేస్తారు. హరిదాసులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో తిరగడం వల్ల పల్లెటూర్లు కోలాహలంగా కనిపిస్తాయి. చాలామంది హరిదాసులు కాలగమనంలో కరువయ్యారు. ఏదో అక్కడక్కడ తప్పిస్తే. సంక్రాంతి పండుగకు శోభ తెచ్చే హరిదాసులు రావాలని పండుగ పూర్వ వైభవం సంతరించుకోవాలని ఆశిద్దాం.

ప్రతి కుటుంబం ఇక సంపన్నమే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబం సంపన్నమే అవుతుందని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని మోరగుడి ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి బాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను పొందుపరిచిన కరపత్రాలను పంచుతూ వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మోరగుడి విశ్వనాథరెడ్డి, పాలూరు సుధీర్‌కుమార్‌రెడ్డి, గ్రామ ఎస్సి కాలనీ నాయకులు ఇమ్మానియల్, చెన్నయ్య, కిషోర్, చెంద్రాయుడు, ప్రసాద్, అనిల్, అశోక్, కుమార్, ప్రసాద్, మోరగుడి గ్రామ నాయకులు వెంకట్రామిరెడ్డి బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, నర్సిరెడ్డి, మాబాషా, మోరగుడి గ్రామ యూత్ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబం అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో భోగి పండుగ సందర్భంగా ఆదివారం శిల్పారామం ఆవరణలో పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీ రాజా కళా నిలయం చిన్నారులచే సంక్రాంతి పండుగ జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ నూతన సంత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా పుర ప్రజలు ఉదయం నుండే శిల్పారామంలో కుటుంబ సమేతంగా ప్రజలు విచ్చేశారన్నారు. బంధువులతో వనభోజాలు ఏర్పాటు చేసుకుని వీక్షించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకులు రాజా, ప్రభాకర్, విల్లాస్‌చ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆరా తీశారు. పట్టణ పరిధిలోని రెండవ కౌన్సిల్ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకు తిరిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు అలీ, భాస్కర్, జిల్లా ఎస్‌సి విభాగం ప్రధాన కార్యదర్శి రవి ప్రకాష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భద్రతలేని పనులు.. అదుపు తప్పుతున్న వాహనాలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలం నుండి వెలుతున్న జాతీయ రహదారి 67కు సంబందించి పనులను సిఆర్ అసోసియేషన్ సంస్థ పనులను చేస్తోంది. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ ఎలాంటి భద్రత చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ రహదారిపై వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం12.30ప్రాంతంలో ఈ రహదారిపై ఐరన్ ఓర్ తీసుకెళుతున్న ఓ లారీ ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి బోల్తా పడింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఇక రాత్రి సమయంలో రహదారిపై కారుల్లో వెళుతున్న వారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగడానికి ఆ కాంట్రాక్టు సంస్థ రహదారి భద్రత చర్యలు చేపట్టకపోవడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. ఇలాంటి ప్రమాదాలు మరిన్ని జరగకుండా నివారించడానికి రోడ్డు నిర్మాణం సంస్థ భద్రతా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. రోడ్డు వెంబడి బారికేడ్లు ఏర్పాటు చేయాలని, లేనిచో ఈ రహదారిపై జరిగే ప్రమాదాలకు ఆ సంస్థ నష్టపరిహారం చెల్లించాలంటున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని బొరెడ్డిగారిపల్లె, వండాడి, కదిరివాండ్లపల్లెలలో వైఎస్‌ఆర్‌ఫౌండేషన్(అమెరికా), చింతం వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జడ్‌పి మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. చింతం నాగులమ్మ, మాజీ ఎంపిపి నారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా అమెరికాలో నివాసమున్న కుటుంబ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబురెడ్డి, మండిపల్లె శివారెడ్డి, వైస్ ఎంపిపి ఎజాస్‌అలీఖాన్, సర్పంచ్‌లు జగన్నాథరెడ్డి, అఫ్రోజ్, నజీర్ అహమ్మద్, ఎంపిటిసిలు గంగులయ్య, రమేష్ బాబు, అంజనప్ప పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

ప్రజాశక్తి-నందలూరు

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని చుక్క వెంకటయ్య, చుక్కా వెంకటేశ్వరయ్య,చుక్క యానాదిలు పేర్కొన్నారు. మండలం లోని మదన మోహనపురం గ్రామపంచాయతీ, చింతకాయలపల్లి గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను వీరు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో గెలిచిన విజేతలకు 50 వేల రూపాయలు, రన్నర్స్‌కు రూ.30 వేలు అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ మ్యాచ్లో చుక్కయపల్లె జట్టుపై చింతకాయలపల్లె జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం నల్లతిమ్మయ్యగారిపల్లె, మిద్దెల మధ్య జరిగిన పోటీల్లో మిద్దెల టీమ్ విజయ దుందుభి మోగించింది. పోటీలు ఆద్యంతం రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీలకు ఆర్గనైజర్‌లుగా చుక్కా రమణయ్య, చింతకాయల ఉపేంద్ర, కడప చిన్నికృష్ణ, భువన బోయిన హరిబాబు, చింతకాయల వెంకటేష్, చింతకాయపల్లి యూత్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

క్రైం కార్నర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి కృష్ణారావు



అరెస్టు అయిన నిందితులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

-ఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

జిల్లాలో గత ఆరు నెలలుగా పలు చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌పి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితులను విలేకర్ల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న కర్ణాటక రాష్ట్రం వర్లకుంటకు చెందిన కృష్ణప్ప రాజేష్, పలమనేరుకు చెందిన తలారి హేమగిరి, మదనపల్లికు చెందిన ఆవుల ప్రసాద్‌ల నుంచి రూ.33లక్షలు విలువచేసే 523.65 గ్రాముల బంగారు ఆభరణాలు, 1545 గ్రాముల వెండి, మారుతి సుజుకి కారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని ఎజి గార్డెన్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. నిందితులపై రాయచోటి అర్బన్ పిఎస్, రైల్వే కోడూరులో మూడు, చిన్నమండెంలో రెండు, మదనపల్లి అర్బన్, మదనపల్లి రూరల్‌లో ఐదు , చిట్వేల్, సంబేపల్లిలో రెండు కేసులు మొత్తం 15 కేసులలో 589.23 గ్రాముల బంగారం, 523.659 గ్రాముల వేండి చోరీ చేశారని తెలిపారు. నిందితుల నుంచి 89 శాతం బంగారం, 53 శాతం వేండిని రికవరీ చేశామని తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. **కలికిరి :** మండంలోని పత్తేగడ గ్రామం, కొటాల గ్రామంలో నివాము్న సంకు శంకరమ్మ ఇంటిలో పది గ్రాముల బంగారు నగలును దోచుకెళ్లిన షేక్ బావాజీ అలియాస్ బాబును అరెస్టు చేసి అతని వద్ద నుంచి చోరి చేసిన మొత్తం సొమ్మును రికవరీ చేసినట్లు ఎస్ఐ ఎస్‌కె.రహీముల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరమ్మ శుక్రవారం రాత్రి తన ఇంటికి తాళం వేసుకొని, అదే ఊరిలో నివాసమున్న తన కుమార్తె ఇంటిలో పడుకొని, మరుసటి రోజు శనివారం ఉదయం తన ఇంటికి రాగా అప్పటికే ఎవరో తన ఇంటి తాళం పగులగొట్టి, ఇంటిలో గల బీరువా నుంచి సుమారు 10 గ్రాముల బంగారు నగలను దొంగిలించుకొని వెళ్ళినట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తన సిబ్బంది ఎఎస్ఐ మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ మనోహర, కానిస్టేబుల్ చైతన్యలతో కలిసి ముమ్మర దర్యాప్తు చేశామని తెలిపారు. అదే రోజు సాయంత్రం మేడికుర్తి, సొరకాయలపేట క్రాస్ బస్సు స్టాప్ వద్ద దొంగతనానికి పాల్పడిన పీలేరు మండలం కోటపల్లికి చెందిన షేక్ బావాజీ అలియాస్‌బాబును అరెస్టు చేసి, అతని వద్ద నుండి చోరీ చేసిన బంగారు నగలను స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించిన్నట్లు వారు తెలిపారు. ఈ కేసును 12 గంటలలోపే ఛేదించిన ఎస్ఐ రహీముల్లా, ఎఎస్ఐ మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ మనోహర, కానిస్టేబుల్ చైతన్యలను వాయల్పాడు సిఐ సురేష్‌కుమార్ అభినంధినారు.

12 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని నిమ్మనపల్లి పంచాయతీ పెద్దమాదిగపల్లి వద్ద ఓ మహిళ నాటుసారాను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఆ మేరకు ఆదివారం పెద్దమాదిగపల్లి వద్ద మహిళ నాటుసారాను విక్రయిస్తుండగా మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆరుగురు కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తున్న ప్రాంతాలలో తన సిబ్బందితో దాడులు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రెండుకత్తులు, రూ.16,060లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.